క్లుప్తంగా

బాధితుల పరామర్శలో విజయానందరెడ్డి


మాజీ సీఎంతోపాటు విజయానందరెడ్డి

తిరుపతి సిటీ: తిరుపతి తొక్కిసలాట ఘటనలో తీవ్రగాయాల పాలై స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఆయనతోపాటు వైఎస్ఆర్ సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానంద రెడ్డి బాధితుల పరామర్శలో పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై అలసత్వం వద్దు

- రీజినల్ డైరెక్టర్ విశ్వనాథ్


రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీ విశ్వనాథ్

చిత్తూరు అర్బన్: వార్డు సచివాలయాల పరిధిలో ప్రజా సమస్యలపై ఎవరూ అలసత్వం వహించరాదని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అనంతపురం రీజినల్ డైరెక్టర్ విశ్వనాథ్ ఆదేశించారు. గురువారం ఆయననగరంలోని 49 వ వార్డు (తిమ్మసముద్రం) సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక దృష్టితో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. పీజీఆర్ఎస్, ఆన్‌లైన్‌లో నమోదయ్యే అర్జీలను నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. సచివాలయంలో అన్ని రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పన్నులను పూర్తి స్థాయిలో వసూలు చేయాలని చెప్పారు. సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించకూడదని తెలిపారు. అనంతరం పలు అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ నరసింహప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యం

గుడిపాల: ఫ్యామిలీ ఫిజిషియన్ విధానంతో గర్భిణులకు ఇళ్ల వద్దే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు వైద్యాధికారి చంద్రమహేష్ అన్నారు. మండలంలోని 189కొత్తపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. బీపీ, చక్కెర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్రచికిత్సలు చేయించుకున్న వారి ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది అనిత, మోహన, చంద్రశేఖర్, సోనియా, ఎలవతి, భాగ్యవతి పాల్గొన్నారు.

టీడీఆర్ జారీపై పకడ్బందీ చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నరసింహప్రసాద్

చిత్తూరు అర్బన్: టీడీఆర్ జారీపై పకడ్బందీ చర్యలు తీసుకోవాలని చిత్తూరు నగరపాలక కమిషనర్ నరసింహప్రసాద్ ఆదేశించారు. గురువారం నగరపాలక కార్యాలయంలో టీడీఆర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా రికార్డులను పరిశీలించి టీడీఆర్ జారీ చేయాలన్నారు. సిబ్బంది అలసత్వం వహించకుండా విధులు నిర్వర్తించాలన్నారు. సమావేశంలో ఏసీపీ నాగేంద్ర, తహసీల్దార్ కళావతి, సబ్ రిజిస్ట్రార్ విజయ్, చుడా పీవో మోహన్, ప్రణాళిక విభాగం అధికారులు పాల్గొన్నారు.

బంగారు భవితకు భరోసా

- బాలికలు, మహిళల కోసం పోస్టల్ పథకాలు
- ఆకర్షణీయంగా సుకన్య సమృద్ధి యోజన
- గడువు ముగియనున్న మహిళా సమ్మాన్

బంగారుపాళెం: బాలికలు, మహిళల ఆర్థిక పురోభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ పొదుపు పథకాలను ప్రవేశ పెట్టింది. బాలికలకు సుకన్య సమృద్ధి యోజన, మహిళలకు మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ పథకాన్ని అమలు చేస్తోంది. పొదుపు చేసిన సొమ్ముకు భద్రతతోపాటు ఈ రెండు పథకాలు బాలికలకు, మహిళలకు భరోసానిచ్చే విధంగా ఉన్నాయి. మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకం అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి మహిళలందరూ ఈ పథకంలో చేరేందుకు అకాశం కల్పించింది. 2025 మార్చి 31 మాత్రమే అమలులో ఉండే ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు డ్రైవ్‌లు నిర్వహించేందుకు సంబంధిత అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఈ పథకంలో రూ.1,000 నుంచి రూ.2 లక్షల వరకు డిపాజిట్‌కు అవకాశం ఉంది. మండలంలో బంగారుపాళెం, మొగిలి వెంకటగిరి సబ్‌పోస్టాఫీసులు పరిధిలో 17 బ్రాంచ్ పోస్టాఫీసులు ఉన్నాయి. బాలికలు, మహిళల కోసం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు.

సుకన్య సమృద్ధి యోజన

ఈ పథకంలో చేరేందుకు 10 సంవత్సరాల్లోపు బాలికలు అర్హులు. కనీసం రూ 250 డిపాజిట్‌తో ఆడపిల్ల పుట్టినప్పుడు ఖాతా తెరిచి, ప్రతీ నెలకూ కనీసం వంద రూపాయలు పొదుపు చేస్తే, తల్లిదండ్రుల మొత్తం పెట్టుబడి రూ.18,000(15 సంవత్సరాలకు)పెడితే వారికి మెచ్యూరిటీ(21 సంవత్సరాల తరువాత) రూ.53,945 తపాలా శాఖ అందిస్తుంది.


బంగారుపాళెం సబ్ పోస్టాఫీస్

మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకం

మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకం వన్ టైమ్ సేవింగ్స్ స్కీమ్‌గా కొనసాగుతోంది. గరిష్ట మొత్తానికి రూ.2 లక్షల లోబడి ఎన్ని ఖాతాలైనా తెరిచే అవకాశాన్ని కల్పించింది. ఇప్పటికే ఖాతా ఉంటే కనీసం మూడు నెలల విరామంతో మళ్లీ ఖాతా తెరవవచ్చు. సేవింగ్స్ ఖాతా ప్రారంభించిన తేదీ నుంచి రెండేళ్లు పూర్తయిన తరువాత మెచ్యూరిటీ కింద డబ్బులు డ్రా చేసుకునే అవకాశం ఉంది. వడ్డీ రేటు మాత్రం ఏడాదికి 7.5 శాతం ఉంటుంది. ఒకరి పేరుతోనే ఖాతా తెరవాలి. జాయింట్ ఖాతా సౌకర్యం లేదు. మైనర్ అయితే గార్డియన్ ద్వారా డిపాజిట్ చేసుకునే వీలుంటుంది.

పథకంలో చేరే విధానం

మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ స్కీమ్‌లో చేరే లబ్ధిదారులు ఆధార్, పాన్‌కార్డు, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని దగ్గరలోని పోస్టాఫీస్‌కు వెళ్లి ఖాతా ప్రారంభించాల్సి ఉంటుంది. ఈ సేవింగ్స్ సర్టిఫికెట్ కింద డిపాజిట్ చేసిన వారు ఏడాది తరువాత 40 శాతం డబ్బు ఉపసంహరించుకునే అవకాశముంది. ఒకవేళ డిపాజిట్‌దారులు మృతి చెందితే కారుణ్యం కింద ఖాతా మూసేయవచ్చు. ఎవరైనా మృతి చెందితే తదుపరి నామినీకి ఆ మొత్తాన్ని చెల్లిస్తారు. అవసరాన్ని బట్టి రెండు శాతం తగ్గించుకుని(5.5 శాతం వడ్డీతో) ఆరు నెలల తరువాత ఎప్పుడైనా ఖాతాను మూసివేయవచ్చు.

మహిళా సమ్మాన్ సేవింగ్స్‌లో సొమ్ము పెరిగేది ఇలా.. (రూ,లతో)

డిపాజిట్	2 ఏళ్ల తరువాత వచ్చే మొత్తం
1,000	1,154
10,000	11,542
50,000	57,714
1,00,000	1,15,428
2,00,000	2,30,854

పోస్టాఫీసుల్లో అందుబాటులో ఉన్న ఇతర పొదుపు పథకాలు

- సేవింగ్స్ బ్యాంక్(ఎస్‌బి)
- పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతా (15 సంవత్సరాలు)
- కిసాన్ వికాస్ పత్రాలు(కేవీపీ)
- రికరింగ్ డిపాజిట్(5 సంవత్సరాల ఆర్‌డీ)
- టర్మ్ డిపాజిట్ అకౌంట్(టీడీ)
- మంత్లీ ఇన్‌కం స్కీమ్(ఎంఐఎస్)
- సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్(ఎస్‌సిఎస్‌ఎస్)
- 5 సంవత్సరాల నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్లు(ఎన్ఎస్‌సి)

అవగాహన కల్పిస్తున్నాం



సుకన్య సమృద్ధి యోజనను ఆడపిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి. బంగారుపాళెం మండలం పరిధిలో రెండు సబ్‌పోస్టాఫీసులు, 17 బ్రాంచ్ పోస్టాఫీసులు ఉన్నాయి. ఈ పోస్టాఫీసుల పరిధిలో 5000 మంది సభ్యులు సుకన్య సమృద్ధి యోజనలో చేరారు. 700 మంది మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకంలో చేరారు. రెండు పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

–మహేష్, సబ్ పోస్టాఫీస్, బంగారుపాళెం

మాజీ సైనికునికి త్రిచక్ర వాహనం


మాజీ సైనికునికి త్రిచక్ర వాహనం అందజేస్తున్న సైనిక సంక్షేమ శాఖ అధికారులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని మాజీ సైనికుడు సూరికి త్రిచక్ర వాహనం అందజేసినట్లు జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి రాఘవులు తెలిపారు. రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ అందజేసిన ఈ వాహనాన్ని మంగళవారం గిరింపేటలోని మాజీ సైనికుల సంక్షేమ కార్యాలయంలో సూరికి అందజేసినట్టు చెప్పారు. అలాగే జిల్లాలోని మాజీ సైనికుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మాజీ సైనికులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది వినాయక రెడ్డి, ప్రమోద్‌కన్నా, సాయిప్రకాష్ పాల్గొన్నారు.

వినాయకుని సేవలో ప్రముఖులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మాజీ ప్రధాని దేవేగౌడ తనయుడు, కర్ణాటక మాజీ మంత్రి రేవణ్ణ స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. హిందూపురం పార్లమెంట్ సభ్యులు పార్థసారధి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు రవీంద్రబాబు, బాలాజీ నాయుడు తదితరులు దర్శనం కల్పించి, ప్రసాదం, స్వామి చిత్రపటం అందించారు.

సంస్కృతీ సంప్రదాయాల కలయికే సంక్రాంతి

యాదమరి (కాణిపాకం): సంస్కృతి, సంప్రదాయాల కలయికే సంక్రాంతి అని ఎంఈఓ రుక్మిణి అన్నారు. యాదమరి మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. తొలుత కేంద్రం ఆవరణలో కొంత మంది మహిళలకు ముగ్గులు పోటీలు పెట్టారు. తర్వాత గొబ్బెమ్మలు పెట్టి పూజలు చేశారు. కాసేపు గొబ్బెమ్మ పాటలతో అలరించారు.


భవిత కేంద్రంలో సంక్రాంతి సంబరాలు

అనంతరం పొంగళ్లు పెట్టి పండుగ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రజాక్, ఉపాధ్యాయురాలు ఆసియా, భవిత కేంద్ర సిబ్బంది ఉమ, మహేష్ ఉన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యకర జీవనం

ఐరాల: పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతంగా జీవించవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని నాగంవాండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో వృద్ధులు, చిన్నారులకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. తక్కువ ఖర్చుతోనే పోషక విలువలు లభించే ఆహార పదార్థాలను వివరించారు. సంప్రదాయ ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ అరుణ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

సెక్టోరల్ అధికారులు తనిఖీలు చేయాలి

- సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీసీ వెంకటరమణారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్: సమగ్రశిక్ష శాఖలో పనిచేస్తున్న ప్రతి సెక్టోరల్ అధికారి ఖచ్చితంగా క్షేత్రస్థాయిలో పాఠశాలల్లో తనిఖీలకు వెళ్లాలని జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. గురువారం సెక్టోరల్ అధికారులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, సంక్రాంతి సెలవుల అనంతరం ప్రతి సెక్టోరల్ అధికారి పాఠశాలలను తనిఖీ చేయాల్సిందేనన్నారు. తనిఖీలకు వెళ్లినప్పుడు ఫొటోలను పంపించాలన్నారు. సెక్టోరల్ అధికారుల జాబ్‌చార్ట్ ప్రకారం విధులు నిర్వహించాలన్నారు. ప్రతి నెలా ముందస్తుగా క్షేత్రస్థాయి పర్యటన షెడ్యూల్ డైరీని సమర్పించాలన్నారు. రాబోయే విద్యాసంవత్సరం విద్యార్థులకు ఇవ్వబోయే షూల పంపిణీకి 1,60,000 మంది విద్యార్థుల కొలతలు పూర్తి చేసినట్లు చెప్పారు. సమావేశంలో సెక్టోరల్ అధికారులు ఉదయలక్ష్మి, నరోత్తమరెడ్డి, జయప్రకాష్‌నాయుడు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించండి

గుడిపాల: పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ శివరాజన్ ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించి ఎంపీడీఓ మాట్లాడారు. పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే తొలుత ఇంటిపన్నులు వసూలు చేయాలన్నారు. అలాగే ప్రాథమిక సహకార సంఘాల్లో సభ్యత్వం, ఖాతాలు ఉన్నట్లయితే వాటిని ఈకేవైసీ చేయించాలన్నారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తలను వేరు చేసి, వాటిని కంపోస్టు ఎరువుగా మార్చి, ఆదాయ వనరుగా చేసుకునే దిశగా సాగాలన్నారు. అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీల విస్తరణాధికారి కృష్ణప్రసాద్, ఏఓ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ శివరాజన్

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ

ఐరాల: హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత తెలిపారు. గురువారం పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ 40 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితమన్నారు. బిడ్డ పుట్టిన వెంటను తల్లి దగ్గర ముర్రు పాలు తాగిస్తే బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. గర్భిణులు గుండె, బీపీ, షుగర్ పరీక్షలు విధిగా చేయించుకోవాలని సూచించారు. సీహెచ్‌ఓ ఆదిలక్ష్మి, పీహెచ్ఎన్ జీవకళ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కానుకలకు చెల్లు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సంక్రాంతి పండుగ వచ్చేస్తోంది. మరో వారం రోజుల్లో మూడు రోజుల పండుగ సంబరాలు. అయితే పేదింట తీపి లేదు. పండుగ కళ లేదు. గత ప్రభుత్వం పండుగ సమయంలో ప్రజలకు లబ్ధి చేకూర్చే విధంగా రేషన్ కార్డుదారులకు సరుకులు అందించేది. కానీ ప్రస్తుత ప్రభుత్వం లబ్ధి లేకున్నా... కానుక అయినా ఇస్తుందా అని ఎదురుచూస్తున్నారు.

జిల్లాలో మొత్తం 5.40 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. నెలనెలా జిల్లాలోని నాలుగు ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా 1379 రేషన్ దుకాణాలకు రేషన్ సరుకులు సరఫరా చేస్తున్నారు. అక్కడి నుంచి 234 ఎండీయూ వాహనాల ద్వారా ప్రతినెలా 1 నుంచి 17వ తేదీ వరకు లబ్ధిదారులకు రేషన్ సరుకుల పంపిణీ చేపడుతారు. కార్డుదారులకు పంపిణీ చేసేందుకు ప్రతినెలా బియ్యం 15 వేల టన్నులు, పంచదార 350 టన్నులు, కందిపప్పు 543 టన్నుల వరకు అవసరమవుతుంది.

మామూలుగానే సరుకుల పంపిణీ

ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సంక్రాంతి కానుక అందుతుందని రేషన్ లబ్ధిదారులు ఆశించినప్పటికీ ప్రస్తుత నెలలోనూ మూడు రకాల నిత్యావసర సరకులే కేటాయించారు. దీనిలో మళ్లీ కంది పప్పు అరకొరే సరఫరా కావడంతో పూర్తి స్థాయిలో కార్డుదారులందరికీ అందే పరిస్థితి లేదు. ప్రస్తుతం రేషన్ సరకుల పంపిణీ కూడా మొదలైంది. సంక్రాంతి కానుక పంపిణీ విషయంలో ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో పండుగ నెలలో సంక్రాంతి కానుక పేరిట రేషన్‌లో బియ్యంతోపాటు గోధుమపిండి, పచ్చిశనగలు, పామాయిల్, కంది పప్పు ఇలా కొన్ని రకాల నిత్యావసరాలను లబ్ధిదారులకు అందించేవారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు.... పండుగకు ఇస్తున్న కానుకలు ఇవ్వలేదని గొంతు చించుకుంది. ఓట్లు దండుకోవడానికి సంక్రాంతి కానుకలను సాకు చూపి ప్రజలను మభ్య పెట్టింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక కూటమి ఏం చేస్తోందని కార్డుదారులు ప్రశ్నిస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక రేషన్ తీసుకోవడానికి వ్యయ ప్రయాసలు మొదలయ్యాయయని వారు వాపోతున్నారు. నిరీక్షించి నీరసించి పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చే సరుకులు కూడా సక్రమంగా అందడం లేదని, కంది పప్పు, చక్కెరను కూడా ఇచ్చినట్టే ఇచ్చి నొక్కేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇక సంక్రాంతి కానుక కూడా అధోగతి అని వాపోతున్నారు.

కాలేజీ విద్యార్థులకు ప్రాక్టికల్ టూల్స్ పంపిణీ


విద్యార్థులకు ప్రాక్టికల్ టూల్స్‌ను అందజేస్తున్న వినోద్ యాదవ్

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం జూనియర్ కళాశాలలో మెకానికల్ విద్యార్థులకు ప్రాక్టికల్‌కు సంబంధించిన లక్ష రూపాయల విలువగల టూల్స్‌ను గురువారం విద్యార్థులకు అందజేశారు. హబులుస్ ఫౌండేషన్ చైర్మన్ వినోద్‌యాదవ్ వీటిని అందజేసి మాట్లాడారు. ఇదే తాను ఈ పాఠశాల పూర్వ విద్యార్థినని, అందుకే ఈ వితరణ చేసినట్టు చెప్పారు. విద్యార్థులు వృత్తి విద్యను అభ్యసిస్తే వారికి మంచి అవకాశాలు అన్నిచోట్లా లభిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శరత్ చంద్రశేఖర్, మెకానికల్ అధ్యాపకులు రెడ్డెప్పరెడ్డి, హబులుస్ ఫౌండేషన్ ప్రతినిధులు మార్కొండమండడి, సాయిప్రతాప్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎంపీడీఓ పనితీరుపై సభ్యుల ధ్వజం


ఎంపీడీఓను నిలదీస్తున్న సభ్యులు

గంగవరం: ప్రజాప్రతినిధులు చెప్పిన సమస్యలను పట్టించుకోకపోగా ఆఖరికి ప్రజాప్రతినిధులనే అగౌరవించిన ఎంపీడీఓ సురేష్‌బాబుపై సభ్యులు ధ్వజమెత్తారు. గంగవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వెంకటరమణ ఆధ్వర్యంలో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓ పనితీరుకు నిరసనగా ఎంపీపీ, జెడ్పీటీసీ సహా సభ్యులంతా సమావేశాన్ని వాకౌట్ చేశారు. దీంతో కోరం లేక సమావేశం నేటికి వాయిదా పడింది.

ముందస్తు సంక్రాంతి వేడుకలు


న్యూయార్క్ పాఠశాలలో..


లిటిల్‌రోస్ పాఠశాలలో..


అరుణాచల డిగ్రీ కళాశాలలో..

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని పలు విద్యాసంస్థల్లో తెలుగుదనం ఉట్టి పడేలా ముందస్తుగా గురువారం సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఆయా పాఠశాల, కళాశాలల నిర్వాహకులు విద్యార్థులకు సంక్రాంతి పండుగ విశిష్టత వివరించారు. అనంతరం విద్యార్థులు భోగిమంటలు వేశారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. గాలిపటాలు ఎగుర వేయించారు. కార్యక్రమంలో న్యూయార్క్ సీబీఎస్ఈ పాఠశాల చైర్మన్ శ్రీధర్, సంసిద్ధ్ క్యాంఫర్డ్ హెచ్ఎం అరుణ్‌కుమార్, అరుణాచల డిగ్రీ కళాశాల చైర్మన్ జగన్నాథరెడ్డి, లిటిల్‌రోస్ కరస్పాండెంట్ గోపాలకృష్ణమూర్తి పాల్గొన్నారు.

తవణంపల్లె మండలంలో..

తవణంపల్లె: మండలంలోని వినాయక విద్యామందిర్ పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ గణపతినాయుడు ఆధ్వర్యంలో హెచ్ఎం పద్మనాభం, ఇన్‌ఛార్జి చెన్నకేశవులు సంక్రాంతి సంబరాలు ప్రారంభించారు. పాఠశాలలో వినాయక స్వామి, సరస్వతి, లక్ష్మీదేవికి పూజలు చేసి సంక్రాంతి పండుగ ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. భోగి మంటలు వేశారు. గొబ్బిళ్లు తట్టి పాటలు పాడారు. పోటీల్లో గెలుపొందిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు కరస్పాండెంట్ గణపతినాయుడు చేతులమీదుగా పంపిణీ చేశారు.


సంసిద్ధ్ క్యాంఫోర్డ్ పాఠశాలలో..




తవణంపల్లె: వినాయక విద్యామందిర్‌లో.. బహుమతులు పంపిణీ చేస్తున్న గణపతినాయుడు